సాక్షి పల్నాడు

శనివారం । 8 । జూలై । 2023



బగళాముఖిసేవలో దొంతిరెడ్డి

పిట్టలవానిపాలెం : బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖ అమ్మవారిని శుక్రవారం ఎక్సైజ్ శాఖ కమిషనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు.



బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని పోలీసు అధికారుల విశ్రాంతి భవనం ఆవరణలో బ్యాడ్మింటన్ కోర్టును డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

నమో శాకంబరీ..



సత్తెనపల్లి: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి గుడిలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

బస్సుల ద్వారా ప్రయాణికులు తరలింపు



దాచేపల్లి : ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ బోగీల దగ్ధం నేపథ్యంలో నడికుడి రైల్వేస్టేషన్‌లో రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేశారు. అందులోని సుమారుగా 350 మంది ప్రయాణికులను 7 బస్సుల ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉంటే ఈ రూట్లో రైళ్లను అధికారులు నిలిపివేశారు.

పోలీసు క్లినిక్‌కు డాక్టర్ నియామకం




నరసరావుపేట: బాపట్ల జిల్లా కసగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.స్రవంతి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న పోలీస్ క్లినిక్‌కు మెడికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలని డాక్టర్ స్రవంతికి ఎస్పీ సూచించారు.

తుళ్ళూరు మండలంలో 12.4 మి.మీ. వర్షం


కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 12.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా దుగ్గిరాల మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... తాడికొండ 7.2, తాడేపల్లి 6.8, మంగళగిరి 6.6, మేడికొండూరు 3.2, పెదకాకాని మండలంలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది.

యార్డులో 36,041 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 33,294 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,041 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.11,500 నుంచి 24,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి రూ.25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,772 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1000, గరిష్ఠ ధర రూ.2,200, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

చెదరని నీ చిరునవ్వు జలయజ్ఞ ఫలాలతో సుభిక్షమవుతున్న పంట భూముల్లో నిత్యం తొణికిసలాడుతోంది. నీ సంక్షేమ స్ఫూర్తి సంతోష లక్ష్మియై ప్రతి ఇంటా నాట్యమాడుతోంది. నీ ఆ'కర్షక' రూపం బడిలో.. మడిలో.. జన జీవన స్రవంతిలో.. ప్రతి పేద మదిలో కొలువుదీరి జేజేలు అందుకుంటోంది. నీ ప్రగతి సంతకం నవ్యాంధ్ర అభివృద్ధి ముఖచిత్రంపై తిరుగులేని ముద్రవేస్తోంది. ఎదురు లేని నీ అడుగు జాడ మరో పది అడుగులు ముందుకేసి జగన్నినాదమై మార్మోగుతోంది. అఖిలాంధ్రను బంగారు బాటన పరుగులు పెట్టిస్తోంది. మరణం లేని ఓ మహానేతా.. నీ ఆశయం అజరామరం.. సదాస్మరణీయం నీ మార్గం..

మరుపురాని మహానేత

మదిమదిలో.. జనహృదిలో..

- పులిచింతల కల నెరవేర్చిన జనాకర్షక నేత
- పంట కాలువల ఆధునికీకరణకు ఆద్యుడు
- ఆయన పాలన స్వర్ణయుగం
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవం
- ఆర్‌బీకేలలో రైతు దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



జన నీ'రాజ'నం : నిజాంపట్నంలో వైఎస్సార్‌పై ప్రజల పూలవర్షం (ఫైల్)



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆంధ్రప్రదేశ్ ప్రగతికోసం, రైతు సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించి ప్రతి గుండెలో కొలువైన రైతు బాంధవుడు, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు దినోత్సవంగా ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 852 రైతు భరోసా కేంద్రాల్లో శనివారం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిలో మహానేత అడుగు జాడలపై ప్రత్యేక కథనం..

57సార్లు పర్యటన

గుంటూరు జిల్లాపై డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని అభిమానం చూపారు. ప్రగతిపై చెరగని ముద్ర వేశారు. టీడీపీ కంచుకోటకు బీటలు వారేలా 2004లో మొత్తం 19 నియోజకవర్గాల్లో 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి రాజకీయ ఉద్దండులను సైతం విస్మయపరిచారు. ముఖ్యమంత్రిగా జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టును నిర్మించి భూములను సస్యశ్యామలం చేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జీవం పోశారు. జిల్లా వేదికగానే ఆరోగ్యశ్రీ పథకానికి పురుడుపోశారు. లక్షలాది మంది రోగులకు ప్రాణభిక్ష పెట్టారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లాలో 57 సార్లు పర్యటించి ఈ గడ్డపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారు.

రాజకీయంగానూ ప్రాధాన్యం

ఉమ్మడి గుంటూరు జిల్లాకు వైఎస్సార్ రాజకీయంగానూ అధిక ప్రాధాన్యం కల్పించారు. జిల్లాకు నాలుగు మంత్రి పదవులు కేటాయించారు. పథకాల అమలులో పెద్ద పీట వేశారు.

అభివృద్ధి అడుగు జాడలు



నమస్తే చెల్లెమ్మ: బాపట్ల జిల్లా నగరంలో డ్వాక్రా మహిళలతో మహానేత (ఫైల్)

- రుణమాఫీ ద్వారా దాదాపు 6.7 లక్షల మంది రైతులకు వైఎస్సార్ రూ.560 కోట్ల మేర ప్రయోజనం కల్పించారు.
- ఇందిర ప్రభ పథకంలో జిల్లా రైతులకు పెద్దపీట వేశారు.
- ఇందిరమ్మ ఫేజ్-2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు.
- రాజీవ్ పల్లెబాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనస్సులో చిరస్థాయిగా నిలిచారు.
- గుంటూరు నగరానికి దాహార్తి తీర్చేందుకు రూ.6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ ప్లాంట్ల వరకు రెండో పైపులైన్ నిర్మించారు. ప్రజల నీటి కష్టాలు తీర్చారు.
- గుంటూరులో రూ.460 కోట్లతో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు.
- విద్యుత్ బకాయిల మాఫీ ద్వారా జిల్లాలో 80 వేల మంది రైతులకు రూ.36 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు.
- ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ.281.60 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారు.
- అపర సంజీవని ఆరోగ్యశ్రీ పథకాన్ని 2008లో గుంటూరు వేదికగానే ప్రారంభించారు.

సేద్యానికి స్వర్ణయుగం



- డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాం సేద్యానికి స్వర్ణయుగం.
- జలయజ్ఞం ద్వారా పులిచింతల ప్రాజెక్టుకు 2004 అక్టోబరు 15న రూ.680 కోట్లతో వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో విజయవాడ, గుంటూరు నగరాల దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు.
- నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008 ఫిబ్రవరి 2న రూ.4,444.41 కోట్లతో అనుమతి ఇచ్చారు. దీని వల్ల 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది.
- కృష్ణా, పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ.4,573 కోట్లు కేటాయించారు. రూ.1760.15 కోట్లతో గుంటూరు జిల్లాలోని కాల్వలను ఆధునికీకరించారు. దీని ద్వారా 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు తొలి అడుగు పడింది.
- వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు.

24 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు

సత్తెనపల్లి: ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో పథకం ప్రకారం సత్తెనపల్లి మండలం దూళిపాళ్లకు చెందిన షేక్ రహీమున్, షేక్ మాలింబి, షేక్ రహిమాన్‌ను హత్య చేశారని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ తెలిపారు. ముగ్గురి హత్య ఘటన జరిగిన 24 గంటల్లోపు నిందితులు షేక్ ఖాసిం, షేక్ జాకీర్, షేక్ సుఫియాలను పట్టణంలోని 27వ వార్డు పెద్ద మసీదు సమీపంలో శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని చెప్పారు. ముగ్గురిని హతమారిస్తే ధూళిపాళ్లలోని రెండు ఎకరాల పొలం, రేకుల ఇల్లు సొంతం చేసుకోవచ్చనే ఉద్దేశంతో గ్రామంలో తమ ఇంటిలో ఉన్న షేక్ రహీమున్, ఆమె కుమార్తె షేక్ మాలింబిని బంధువులైన మసీద్ ఇమాంషా, మసీద్ అబ్దుల్ సర్దార్, సయ్యద్ మౌలాలి, చుట్టుపక్కల వాళ్లు చూస్తుండగానే కత్తులతో దాడి చేసి హతమార్చారని వివరించారు. షేక్ రహిమాన్‌ను సత్తెనపల్లి శివారులోని కేఎస్‌పీ దాబా వెనక్కు తీసుకొని వెళ్లి మెడకు నవారు, వైరు బిగించి లాగి ఊపిరాడకుండా చేసి హత మార్చారని తెలిపారు. హత్యలో భాగస్వాములైన ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని చెప్పారు. కేసులో సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు, సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్‌బాబు, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అవుల బాలకృష్ణతో పాటు రాజుపాలెం, నకరికల్లు, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐలు సహకరించినట్లు డీఎస్పీ తెలిపారు.

గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఓగా షేక్ షహబాజ్



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని సీనియర్ డీసీఓగా షేక్ షహబాజ్ హనూర్ ను నియమిస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఆయన గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని డీఆర్ఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీనియర్ డీసీఓగా ఉన్న ఎ.సీతాశ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేశారు.

దూరవిద్యలో దురాలోచన

డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

అమరావతి: ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు డిగ్రీ కళాశాల మాస్ కాపీయింగ్‌కు వేదికగా మారింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య డిగ్రీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. గతేడాది కూడా మాస్ కాపీయింగ్ జరగడంతో మాజీ ఎమ్మెల్యే, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు వై.వి.ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేయకుండా ఇక్కడ దూరవిద్య పరీక్ష కేంద్రానికి అనుమతి ఇవ్వరాదని తీర్మానం కూడా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యం డిగ్రీ పరీక్షలు నిర్వహించుకోవడానికి మరలా అనుమతినివ్వడంతో గత సోమవారం నుంచి మొదలయ్యాయి. ఇక్కడ సెంటర్ అనుమతించడానికి, అభ్యర్థుల నుంచి వసూళ్లు, పరీక్షలు రాయడానికి వేరే వారిని ఏర్పాటు చేయడానికి కళాశాలలో తాత్కాలిక ఉద్యోగి కీలక పాత్ర పోషించాడని సమాచారం. సెంటర్‌లో 502 మంది డిగ్రీ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో విద్యార్థులు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో కొంతమంది పరీక్షలకు రాకుండా వేరే వారికి డబ్బు చెల్లించి రాయిస్తున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 10వేల నుంచి రూ. 15వేల వరకు వసూలు చేసి పాఠ్య పుస్తకాలు ఇచ్చి చూసి రాసుకునే వెసులుబాటు కల్పించడం గమనార్హం. దీనిపై ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య డిగ్రీ పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.పున్నారెడ్డి వివరణ ఇస్తూ.. కళాశాల ఆవరణలో మాస్ కాపీయింగ్ జరగలేదని తెలిపారు. హాస్టల్‌లో ఏం జరిగిందో తమకు సంబంధం లేదని చెప్పారు.



కళాశాల పక్కన హాస్టల్‌లో చూసి రాస్తున్న విద్యార్థులు

పేదల కోసమే రాయితీపై టమాటాలు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతున్న పేద వినియోగదారులను ఆదుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై టమాటాలను అందిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏటా ఈ సీజన్‌లో వర్షాల కారణంగా పంట దెబ్బతిని టమాటాల దిగుబడి తగ్గిపోతుందని, ధరలు పెరుగుతాయని, ప్రజల కోసం ప్రభుత్వం నేరుగా రాయితీపై టమాటాలను అందిస్తోందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.100 నుంచి రూ.140 వరకు ఉండగా వినియోగదారులకు రూ.50కే అందిస్తున్నట్టు వివరించారు. శుక్రవారం 1,500 కిలోలు సబ్సిడీపై పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జయపాల్, నాయకులు దేవరశెట్టి రవికుమార్, వెలుగూరి శరత్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి భాస్కరరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, వ్యవసాయ కమిటీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



టమాటాలను వినియోగదారులకు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

గుంటూరు రైల్వే డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు–గుంతకల్లు సెక్షన్‌లోని తుర్లపాడు, కంభం, జగ్గంభొట్ల, కృష్ణాపురం మధ్య ఉన్న ఓహెచ్ఈ ట్రాక్ వంతెనలను శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ పి.డి.మిత్రా, గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ పరిశీలించారు. అనంతరం గుంటూరు – గుంతకల్లు సెక్షన్ మధ్య బ్రాడ్‌గేజ్ రైల్ డబ్లింగ్‌లో ట్రాక్‌ను ప్రారంభించారు. మిత్రా మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.



రైల్వే ట్రాక్ పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ పీడీ మిత్ర, డీఆర్ఎం రామకృష్ణ

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 519.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

పేటకు ఫౌండేషన్స్ పోటు

- పుల్లారావు, ప్రవీణ్‌లు పోటాపోటీ
- భాష్యంకు షోకాజ్ నోటీసు జారీ
- జీవీ పత్తిపాటి పక్షపాతి అంటూ ఆరోపణలు
- చిలకలూరిపేట టీడీపీలో ఊరూరా వర్గాలు
- తండ్రీకొడుకులు ఎవరిని తేల్చేనో!



బోయపాలెంలో టీడీపీ జెండాలతో ప్రచార రథంపై ర్యాలీ చేస్తున్న భాష్యం ప్రవీణ్

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి/సాక్షి, నరసరావుపేట: ఫౌండేషన్స్ పేరిట సేవా కార్యక్రమాలు చేసేస్తామని తెగ హడావుడి కొనసాగిస్తున్న టీడీపీ నాయకుల లోగుట్టు రట్టయి రోడ్డెక్కింది. భాష్యం, నారా, పత్తిపాటి ఫౌండేషన్ల పేరిట ఏర్పాటుచేసిన నిర్వాహకులది సేవాభావం కాదని, రాజకీయ వైభోగానికే ఈ ఆరాటాలు, పోరాటాలని తేటతెల్లమైంది. చేసేది గోరంత చెప్పుకునేది కొండంతగా ఉంటున్న వీరి వ్యవహారాలను చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజానీకం నిశితంగా గమనిస్తోంది. కొన్నినెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో సేవల ముసుగులో నగదు, వస్తువుల పంపిణీ, అన్న క్యాంటీన్ల నిర్వహణ ద్వారా నాయకుడై పోవచ్చని కలలుకంటున్న భాష్యం ప్రవీణ్ తీరును ఓవైపు, ఎన్నికల్లో ఓటమిపాలై దాదాపు నాలుగేళ్లు ముఖం చాటేశారని స్వపక్షీయుల నుంచే అపప్రదను మూటకట్టుకున్న మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు వైనాన్ని మరోవైపు చిలకలూరిపేట రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. శుక్రవారం వీరివురి మద్దతుదారులు రోడ్లెక్కి తమ వర్గానిదే పైచేయంటూ రచ్చచేస్తుండటంతో 'పేట టీడీపీకి ఫౌండేషన్స్ పోటు' తప్పదని ఆ పార్టీ నాయకులే అంచనాకు వస్తున్నారు. తండ్రీకొడుకులైన చంద్రబాబు, లోకేష్‌లు చెరోవర్గాన్ని ప్రోత్సహిస్తూ తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండనే రీతిలో చేసేశారని, ఇంకెవరు ఎన్నివిధాల వర్గాల మధ్య సర్దుబాట్లకు యత్నించినా ఫలితం నిష్ప్రయోజనమనే భావనకు స్వపక్షీయులు వచ్చేశారంటున్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అన్నివర్గాలకు ప్రయోజనాలను చేకూరుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పనితీరును నియోజకవర్గ ప్రజలు అంచనా వేసుకుంటున్నారని టీడీపీ వారే అభిప్రాయపడుతుండటం గమనార్హం.

పత్తిపాటికి వ్యతిరేకంగా...

టీడీపీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షునిగా, మాజీ మంత్రిగా వ్యవహరించిన పుల్లారావును నియోజకవర్గంలోని పలువురు సీనియర్లు వ్యతిరేకిస్తూ వచ్చారు. మంత్రిగా పుల్లారావు ఉన్నప్పుడు ఆయన సతీమణి పెత్తనంతో ప్రజలతోపాటు తామూ విసిగిపోయామని, ఎన్నికల తరువాత ముఖం చాటేశారనేది చంద్రబాబుకు అందిన ప్రధాన ఫిర్యాదుగా తెలుస్తోంది. సీనియర్లను రాజకీయంగా ఎలాగైనా పక్కకు వైదొలగించాలనే ఎత్తుగడలో భాగంగా లోకేష్ పుల్లారావు స్థానంలో ప్రవీణ్‌ను ప్రోత్సహిస్తున్నారని టీడీపీ వర్గాలే బాహాటంగా అంటున్నాయి. అందువల్లే భాష్యం ఫౌండేషన్ ముసుగులో రాజకీయ ఆరంగేట్రానికి ప్రవీణ్ తెరతీశారంటున్నారు. అతని ఎత్తుగడలను పసిగట్టిన పుల్లారావు అచ్చెన్నాయుడు ద్వారా తనదైనశైలిలో అడ్డుకోగలిగారు. దీంతో తన పేరిట ఉన్నదాన్ని నారా ఫౌండేషన్‌గా మార్పుచేసి కార్యక్రమాలను కొనసాగిస్తున్న ప్రవీణ్‌ను పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ద్వారా ఎవరూ పైఫౌండేషన్ వ్యవహారాల్లో పాల్గొనవద్దంటూ హెచ్చరికలను జారీ చేయించగలిగారు పుల్లారావు.

జీవీ హెచ్చరికలు బేఖాతరు చేస్తూ...

జీవీ హెచ్చరికలను బేఖాతరు చేయడంతోపాటు వాటిని ఫేక్ అని ప్రవీణ్ కొట్టిపారేస్తూ శుక్రవారం యడ్లపాడు మండలం బోయపాలెంలోని శ్రీపార్వతీదేవి ఆలయంలో పూజలు, మసీదులో నమాజ్ చేశారు. హైవేపై పార్టీ జెండాలతో బైక్ ర్యాలీగా చిలకలూరిపేటకు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి, నారా ఫౌండేషన్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ర్యాలీలో పలుగ్రామాలకు చెందిన ప్రత్తిపాటి వ్యతిరేక వర్గీయులు పాల్గొనడం చర్చనీయాంశమైంది.

పుల్లారావుకు మద్దతుగా భేటీ..

వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పేటలోని పార్టీ కార్యాలయంలో పుల్లారావుతో భేటీ అయ్యారు. అధిష్టానం టికెట్ నిరాకరించిన పక్షంలో వివిధ హోదాల్లోని వారంతా పుల్లారావుకు మద్దతుగా మూకుమ్మడి రాజీనామాలు చేయాలని, ఒకవేళ ప్రవీణ్‌కు ప్రాధాన్యమంటే ఆందోళనలకు సిద్ధపడాలనే నిర్ణయానికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆఫీసులోనే గడిపారు. పత్తిపాటి ఫౌండేషన్ పేరిట తాజాగా మొబైల్ అన్న క్యాంటిన్‌ను ఆరంభించిన పుల్లారావు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలనే నిర్ణయానికి వచ్చారు. బైక్ ర్యాలీపై అధిష్టానానికి పుల్లారావు ఫిర్యాదు చేయడంతో ప్రవీణ్‌కు జాతీయ క్రమశిక్షణ కమిటీ పేరిట గుంటుపల్లి నాగేశ్వరరావు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీచేశారు.

సీనియర్లది పక్షపాత ధోరణంటూ..

టీడీపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులైన అచ్చెన్నాయుడు, జీవీ ఆంజనేయులు పక్షపాత వైఖరితో పుల్లారావుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రవీణ్ వర్గీయులు బాహాటంగానే ఆరోపణలు చేస్తుండటం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. తాము లోకేష్‌ను కలిసి అన్ని విషయాలూ వివరిస్తామని, అప్పుడు ఎవరి సంగతి ఏంటో తేలుతుందని అంటున్నారు. పేట టీడీపీ రాజకీయాలు చివరికెటు దారితీస్తాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొనడం కొసమెరుపు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మౌలాలి మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి పట్టణంలోని వెంకటపతి కాలనీ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి 22 వార్డు నాగన్నకుంటకు చెందిన షేక్ మహబూబ్ షరీఫ్ (దూద్‌కే) ఫర్నీచర్ షాపు నిర్వహిస్తుంటారు. చెక్క పని చేసే షేక్ మౌలాలీ(55)ని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని బండి స్టార్ట్ చేసే క్రమంలో... ఇరుకుపాలెం వైపు నుంచి సత్తెనపల్లి వస్తున్న పొక్లెయిన్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం వెనుకవైపు ఉన్న మౌలాలి కింద పడ్డాడు. పొక్లెయిన్ ఆయన పైకి ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం ముందు ఉన్న దూద్‌కేకి గాయాలయ్యాయి. ఆటోలో ఇద్దరిని ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మౌలాలి మృతి చెందాడు. ఘటనపై పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

మంత్రి అంబటి రాంబాబు


భూమిపూజలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్

ముప్పాళ్ల: పేదల విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాతల సాయం రూ.15లక్షలతో నిర్మిస్తున్న మీటింగ్ హాలు నిర్మాణానికి కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలసి మంత్రి భూమిపూజలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని విద్య, వైద్యంపైన జగనన్న ప్రత్యేక దృష్టి పెట్టి నాలుగు సంవత్సరాల్లో అనేక ఆసుపత్రుల రూపురేఖలు మార్చారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలపై నమ్మకం పెంచేలా సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పాటు ప్రేమ, ఆప్యాయతతో పనిచేస్తే ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే అమ్మఒడి ద్వారా నిరక్షరాస్యత శాతం తగ్గుతోందని తెలిపారు. గ్రామాల్లో కొన్ని పనులకు దాతల సాయం ఉండాల్సిందేనని, అన్నీ ప్రభుత్వమే చేయాలనుకోవడం సరైంది కాదని చెప్పారు. ఈ సందర్భంగా మీటింగ్ హాలు నిర్మాణానికి తోడ్పాటు అందించిన కంచర్ల కృపారావు, మణిరావు దంపతుల్ని అభినందించారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మంచి అభిప్రాయం ఏర్పడేలా వైద్య సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిపించాలని, మరో మూడు నెలల్లో ముప్పాళ్ల పీహెచ్‌సీలో పది పడకలతో అదనపు సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఐలు కంచర్ల కృపారావు, మణిరావు దంపతుల్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ అసోసియేషన్ సలహాదారు బాలస్వామి, ఎన్‌ఆర్‌ఐలు కంచర్ల కృపారావు మాట్లాడారు. పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన తల్లీబిడ్డా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇటీవల కేంద్ర వైద్య సిబ్బంది పీహెచ్‌సీని సందర్శించి అందించిన ఎన్‌కాస్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ శివశంకర్, మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా వైద్యాధికారి రమాదేవి స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మ, అదనపు డీఎంహెచ్‌వో జి.చంద్రశేఖర్, సర్పంచ్ సతీష్, వైస్ ఎంపీపీ రాయన్న, వైద్యులు జయకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం రూ. 218 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


స్కీమ్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ. 218 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణానికి రూ. 120 కోట్లు, దాచేపల్లి పట్టణానికి రూ. 16.5 కోట్లు, గురజాల పట్టణానికి రూ. 8.5 కోట్లు, గురజాల నియోజకవర్గంలోని 57 గ్రామాలకు రూ. 73 కోట్లు కలిపి మొత్తం రూ. 218 కోట్లు మంజూరయ్యాయని తెలియజేశారు. జలదీక్ష కార్యక్రమం ద్వారా మాచవరం మండలంలోని తురకపాలెంలో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని 200 ఇళ్లకు పైపులైన్ ద్వారా వాటర్ కనెక్షన్ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలో సెకండ్ ఫేజ్‌లో 1500 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే పిడుగురాళ్ల పట్టణంలోనే ప్రథమంగా ఇస్తున్నామని తెలిపారు. గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. టీడీపీలో 30 ఏళ్లుగా ఉన్న యరపతినేని శ్రీనివాసరావు చేయలేని అభివృద్ధిని తాము 30 నెలల్లోనే చేసి చూపించామని తెలిపారు. ప్రతిసారీ యరపతినేని గురజాలలో పోటీ చేయిఅని అనడం హాస్యాస్పదంగా ఉందని, మళ్లీ పోటీ చేసేది తానేనని, గెలిచేది తానేనని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు


పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామానికి చెందిన 16 కటుంబాలు టీడీపీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఇందులో గ్రామానికి చెందిన బోయిన శివ, ఇండ్ల శ్రీనివాసరావు, బయినబోయిన రాజు, బయిన బోయిన ఆవులయ్య, దొడ్డా వెంకటరామయ్యతో పాటు మరో పది కుటుంబాలు ఉన్నాయి. పార్టీ గ్రామ నాయకులతో వారంతా మాచర్ల తరలివెళ్లి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పథకాలతో పాటు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాయకత్వం నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, చీతిరాల వెంకటకోటేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై రూ.50కే కిలో టమాటాలు


మార్కెట్‌యార్డులో టమాటా విక్రయ కేంద్రాన్ని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు ఎక్కువగా ఉండడంతో సబ్సిడీపై ప్రభుత్వం కిలో రూ.50కే అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డులో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ విక్రయ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలిసి ఎమ్మెల్యే రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టమాటా ధర పెరుగుతున్నందున ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని వివరించారు. కోవిడ్ సమయంలో టమాటా, ఉల్లిపాయలను సబ్సిడీపై పంపిణీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. నరసరావుపేటకు 1,500 కిలోల టమాటాలు వచ్చాయని, మూడురోజుల పాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ ట్రేడ్ మార్కెట్ ఆఫీసర్ కె.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాకు ఐదు టన్నులు కేటాయించిందన్నారు. చిలకలూరిపేటకు రెండు టన్నులు, నరసరావుపేట, సత్తెనపల్లికి 1.5టన్నులు సరఫరా చేసినట్టు వివరించారు. చిలకలూరిపేట, సత్తెనపల్లిల్లో రైతుబజార్లలో విక్రయిస్తుండగా నరసరావుపేటలో మార్కెట్‌యార్డులో కేంద్రం ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, యార్డు కార్యదర్శి సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కనకా పుల్లారెడ్డి, మూరే రవీంద్ర, పూనూరి కోటిరెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

- 75త్యాళ్ళూరు పీహెచ్‌సీ ఎదురు టాబ్లెట్లు, స్పిరిట్ మింగి అఘాయిత్యం
- పెదకూరపాడు సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స
- పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కి తరలింపు
- సిబ్బంది వేధింపులే కారణమని సూసైడ్ లెటర్
- పరిస్థితి విషమం


గుంటూరు జీజీహెచ్‌లో రఘునాథ్

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ కంబాల రఘునాథ్ బాబు టాబ్లెట్లు, స్పిరిట్ మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆయన గత 16 నెలలుగా అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల దాచేపల్లికి బదిలీ అయ్యారు. అనారోగ్య కారణాలతో అక్కడకు బదిలీ చేయవద్దని, 75త్యాళ్లూరు పీహెచ్‌సీలోనే కొనసాగించాలని ఉన్నతాధికారుల్ని కోరారు. ఈ క్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ సీనియర్ హెల్త్ అసిస్టెంట్ ఖాదర్‌వలి, 75 త్యాళ్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఎస్ దిలీప్‌కుమార్‌లు అధికారులతో ట్రాన్స్‌ఫర్ నిలుపుదల చేసుకుంటావా? అంటూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని రఘునాథ్‌బాబు సూసైడ్ లెటర్‌లో పేర్కొన్నారు. సిబ్బంది వేధింపులు, ట్రాన్స్‌ఫర్‌తో మానసికంగా ఆవేదనకు గురై శుక్రవారం పీహెచ్‌సీలో విధులకు హాజరై టాబ్లెట్లు మింగి, స్పిరిట్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, వైద్య బృందం మెరుగైన వైద్యం కోసం పెదకూరపాడు సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యుల సూచనల మేరకు 108లో గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ విషయమైన 75త్యాళ్లూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంకను వివరణ కోరగా, రఘునాథ్‌బాబు గత ఏప్రిల్ 15వ నుంచి విధులకు హాజరుకావడం లేదని, ఆయన స్థానంలో బదిలీలో భాగంగా దాచేపల్లి పీహెచ్‌సీ నుంచి అవినాష్ వచ్చి జాయిన్ అయ్యారని తెలిపారు. రఘునాథ్‌బాబు జూన్ 1 నుంచి పీహెచ్‌సీకి విధులకు హాజరవుతున్నారన్నారు. బదిలీ నిలిపివేసినట్లు ఆర్డర్ కాపీ ఇవ్వలేదని, దాన్ని తీసుకుని రావాలని కోరామని తెలిపారు. ఈ నెల 20న ఆర్డర్ కాపీ తెచ్చారని, అందుకు అనుగుణంగా 21 నుంచి సప్లమెంటరీ జీతం తయారు చేసినట్లు వివరించారు. రఘునాథ్‌బాబు ఆరోపణలో వాస్తవాలు లేవని చెప్పారు.

అవినాష్ గుప్తాను అరెస్టు చేయాలి

- ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధుల డిమాండ్
- చేనేతలపై దాడులకు ఖండన


ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులపై దాడులను నిరసిస్తున్న కమిటీ సభ్యులు

మంగళగిరి: ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులపై అతి కిరాతకంగా దాడి చేసి దుర్భాషలాడిన అవినాష్ గుప్తాను వెంటనే అరెస్టు చేయాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలోని మార్కండేయ కళ్యాణ మండపంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చేనేత సంఘం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాటాడారు. చేనేతల వద్ద వస్త్రాలు కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటూ తమ వద్ద తీసుకున్న వస్త్రాలకు నగదు అడిగేందుకు వెళ్లిన ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులను అతికిరాతంగా దుర్భాషలాడటమే కాకుండా వీడియోను కూడా సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ అధికార మదంతో విర్రవీగుతున్న అవినాష్ గుప్తాను అరెస్టు చేయాలని కోరారు. లేనిపక్షంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. చేనేతలపై జరిగే దాడులను సుమోటోగా స్వీకరించి దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ధర్మవరం చేనేత వ్యాపారులపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం చేనేత వస్త్రాలయాలు, మాస్టర్స్ వీవర్స్ చేనేత ఉప వృత్తులు, చేనేత వృత్తుల వారు షాప్‌లను బంద్ చేసి భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు పునరావృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలందరూ కలసి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, జొన్నాదుల మణి, రామనాథం పూర్ణచంద్రరావు, దోకుపర్తి రామారావు, కూరపాటి కోటేశ్వరరావు, బత్తూరి మోహనరావు, కొలుసు రవి, స్వరం పుల్లారావు, రామచంద్రరావు, పచ్చల నాగేశ్వరరావు, రామనాథం పరమేశ్వరరావు, భీమిశెట్టి బాలేశ్వరరావు, గజపల్లి వెంకట కృష్ణారావు, దొడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో సత్తా చాటారు

- 5 గోల్డ్ మెడల్స్ 3 బ్రాంజ్ మెడల్స్ కైవసం
- పోర్చుగల్ లో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి మ్యూజికల్ ఫార్మ్ కర్రసాము పోటీల్లో సాధించిన పథకాలతో క్రీడాకారులు

పెదకాకాని: జాతీయస్థాయి మ్యూజికల్ ఫార్మ్ కర్రసాము పోటీల్లో ఆంధ్ర క్రీడాకారులు ఐదు బంగారు, మూడు రజిత పతకాలు సాధించారు. ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నందు జాతీయస్థాయి వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాగమైన మ్యూజికల్ ఫార్మ్ కర్ర సాము పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ర సాము కోచ్ ఖరీదు సాంబయ్య సారథ్యంలో క్రీడాకారులు పాల్గొన్నారు. గత మేలో వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన మ్యూజికల్ ఫామ్ కర్ర సాము పోటీల్లో ప్రతిభ కనబరిచి సీనియర్ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సంగతి విదితమే. సీనియర్ విభాగంలో జాతీయస్థాయి మ్యూజికల్ ఫార్మ్ కర్ర సాము పోటీల్లోనూ సత్తా చాటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సింగిల్, గ్రూప్ ఈవెంట్లలో ప్రతిభ కనబరిచి కొర్రపాటి చంద్రశేఖర్ రెండు గోల్డ్ మెడల్స్, ఖరీదు సాంబయ్య గోల్డ్ మెడల్, బ్రాంచ్ మెడల్, పత్తి పవన్ కుమార్ గోల్డ్ మెడల్, బ్రాంజ్ మెడల్, మట్టుపల్లి తరంగణి సింగ్ గోల్డ్ మెడల్ , బ్రాంచ్ మెడల్ సొంతం చేసుకున్నారు. ఈ పోటీలకు 23 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పథకాలు సాధించిన అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ వాకో ఇండియా ప్రెసిడెంట్ ఆనంద్ బాలు, సెక్రటరీ కె.నరేంద్ర అభినందించారు. జాతీయస్థాయిలో పథకాలు సాధించిన ఈ క్రీడాకారులు నవంబర్‌లో పోర్చుగల్ దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు.

'భాష్యం' ప్రవీణ్‌కు టీడీపీ షోకాజ్ నోటీసు

చిలకలూరిపేటలో రచ్చకెక్కిన ఆధిపత్య పోరు

సాక్షి, అమరావతి : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ టీడీపీ అధిష్టానం 'భాష్యం' ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చింది. పార్టీ క్రమశిక్షణా కమిటీ తరఫున గుంటుపల్లి నాగేశ్వరరావు శుక్రవారం ఈ నోటీసు జారీచేశారు. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా నిర్వహించిన కార్యక్రమాలపై ఈనెల 10న మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. నోటీసులో 'భాష్యం' ప్రవీణ్‌ను తాడికొండ నియోజకవర్గ నేతగా పేర్కొనడం విశేషం. చిలకలూరిపేటలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్ వర్గాల మధ్య కొద్దిరోజులుగా ఆధిపత్యపోరు నడుస్తోంది. ప్రవీణ్ తనకే ఎమ్మెల్యే సీటు ఇస్తున్నారని చెబుతూ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తుండగా పుల్లారావు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రవీణ్ శుక్రవారం చిలకలూరిపేటలో భారీ ర్యాలీకి సిద్ధమయ్యారు. దీన్ని వ్యతిరేకిస్తూ పుల్లారావు వర్గీయులు సమావేశమై పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించడంతో టీడీపీ అధిష్టానం జోక్యం చేసుకుని ప్రవీణ్‌ను ర్యాలీ చేయవద్దని ఆదేశించింది. అయినా.. ప్రవీణ్ ర్యాలీ నిర్వహించడంతో పార్టీ ఆదేశాలను ధిక్కరించారని షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

తెలంగాణ మద్యం సీజ్

క్రోసూరు: అచ్చంపేట మండలం పులిచింతల డ్యాం వద్ద కారులో తరలిస్తున్న తెలంగాణ మద్యం సీసాలతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అచ్చంపేటకు చెందిన రామిశెట్టి కోటేశ్వరరావు, షేక్ రబ్బానీని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 212 మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయ అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: జాతీయస్థాయిలో దివ్యాంగులకు ప్రత్యేకంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సాధికారతకు కృషి చేస్తున్న దివ్యాంగులు, వ్యక్తులు, సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డిజేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గలవారు ఈనెల 31వ తేదీలోగా www.awardr.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి డిసెంబర్ 3 అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం రోజున జాతీయ అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు వెబ్సైట్ను సందర్శించాలన్నారు.

గిరిజన వసతి గృహంలో ఏసీబీ తనిఖీలు

అల్పాహార, భోజన మెను సరిగాలేదని విద్యార్థుల ఫిర్యాదులు


మాట్లాడుతున్న ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర

నగరంపాలెం: గుంటూరు నగరంలోని కొత్తపేట శీలంవారివీధి ప్రభుత్వ గిరిజన కళాశాల బాలుర వసతి గృహం-2లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అల్పాహారం, భోజనం రుచిగా ఉండటం లేదని, నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందనే విద్యార్థుల ఫిర్యాదుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఏసీబీ ఏఎస్పీ ఎం.మహేంద్ర, డీఎస్పీ ఎస్.సత్యానంద్, సీఐలు లక్ష్మారెడ్డి, నాగరాజు, మన్మథరావు, సురేష్, ఎస్ఐ మూర్తి, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీలు ఏకకాలంలో రంగంలోకి దిగారు. అద్దెకు ఉన్న వసతిగృహం అంతటా కలియ తిరిగారు. ఆవరణలోని పరిసరాలు, గదులు, మరుగుదొడ్లను నిశితంగా పరిశీలించారు. మరుగుదొడ్లు, పరిసరాలు దుర్వాసన వెదజల్లాయి. వార్డెన్ ఎ.కోటేశ్వరరావుతో ఏసీబీ అధికారులు మాట్లాడారు. ఇక్కడ ఎంత మంది విద్యార్థులున్నారు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనపు మెను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను, నిత్యావసర సరకులు, ఇతరత్రా మౌలిక సౌకర్యాలపై ఆరాతీశారు. ఈలోగా ఆ శాఖ డీడీని పిలిచి మాట్లాడారు. ఏసీబీ అధికారులు ఓ వైపు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో దుర్వాసన తలెత్తకుండా ఉండేందుకు ఫినాయిల్ చల్లించడం విశేషం. ఏఎస్పీ మహేంద్ర విలేకర్లతో మాట్లాడుతూ వసతి గృహంలో 39 మంది విద్యార్థులకు అదనంగా పది మంది ఉన్నారని అన్నారు. ఒకవేళ ఆ పది మంది ఇంకనూ పేర్లు నమోదు చేసుకున్నారా లేదా అనేది విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మెనూని ఆచరించడంలేదని చెప్పారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, ఎక్కడా కూడా శుభ్రతలేదన్నారు. వసతిగృహంలో జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ ప్రధాన కార్యాలయంతోపాటు గుంటూరులోని కార్యాలయానికి విద్యార్థులు ఫిర్యాదులు చేయడంతో ఈ తనిఖీలు జరిగాయని చెప్పారు. అల్పాహారం, భోజనం రుచిగా ఉండదని, కూరలు బాగుండవని ఓ విద్యార్థి వాపోయాడు. ఉదయం వేళల్లో అల్పాహారం బయట భుజించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నాలుగుసార్లు జిల్లా కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు.

పోలీస్ వాహనాలు కండీషన్‌లో ఉండాలి

బాపట్ల టౌన్ : పోలీస్ వాహనాలు అనునిత్యం కండీషన్‌లో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వాహనాల పనితీరు, వాటి నిర్వహణను పరిశీలించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. వాహనాలకు పెయింటింగ్, పోలీసు స్టిక్కర్స్, అత్యవసర హారన్ సక్రమంగా అమర్చుకోవాలన్నారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా చూసుకోవాలని చెప్పారు. పోలీస్ వాహనాల నిర్వహణ, లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించారు.